క్లుప్తంగా

పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించాలి



పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

రాంబిల్లి(యలమంచిలి): రోగులకు అందుబాటులో ఉంటూ అత్యవసర వైద్యసేవలు అందించాలని డీఎం అండ్ హెచ్‌వో పి.రవికుమార్ అన్నారు. దిమిలి పీహెచ్‌సీని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై నేరుగా ఆస్పత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో లేబోరేటరీని, ఫార్మాసిస్టు రూమ్‌లో మందులను ఆయన పరిశీలించారు. ఓపీ తదితర రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ ఎస్.రాయవరం ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలు తొలగించే పనులు కారణంగా ఎస్.రాయవరం, వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట ఆక్వా చెరువులకు, వమ్మవరం తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వేడుకగా రాట మహోత్సవం



మునగపాక దళితవాడలో రాట మహోత్సవం

మునగపాక: మునగపాక దళితవాడలోని రామాలయం వద్ద బుధవారం రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 15న వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రామాలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వేపచెట్టుకు పసుపు, కుంకుమ అద్ది రాట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిల్లి అప్పారావు, డొక్కా నాగభూషణం, కోనపల్లి రామ్మోహనరావు, రాజాన బుజ్జి, బీలా లక్ష్మణరావు, అప్పలనాయుడు, సాంబశివ, కరణం గణేష్, బీలా శివగణేష్, మహేష్, నూకరాజు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీళ్లు లేవు.. నీడా లేదు!



- ఉపాధి కూలీలకు మౌలిక వసతుల కరువు
- అడ్రస్ లేని గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు
- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత

మండలంలో జాబ్ కార్డులు	యాక్టివ్ జాబ్ కార్డులు	వేతనదారులు	ప్రస్తుతం పనులు జరుగుతున్న పంచాయతీలు / పనులు జరగని పంచాయతీలు	పనులకు వెళుతున్న కూలీలు
9871	5200	7 వేలు (సుమారు)	16 / 01 (లైనుకొత్తూరు)	1451

యలమంచిలి రూరల్: వేసవి ఆరంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తల్లడిల్లిపోతున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ ఉపాధి కూలీలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.గ త వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. యలమంచిలి మండలంలో మున్సిపాలిటీని మినహాయిస్తే 17 గ్రామ పంచాయతీలుండగా.. 16 పంచాయతీల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మొత్తం 9,871 జాబ్ కార్డులుండగా వీటిలో సుమారు 5,200 జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. సుమారుగా 7 వేల మంది వేతనదారులున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న గ్రామాల్లో 1451 మంది ఆయా పనులకు హాజరవుతున్నారు. క్షేత్ర సహాయకుడు రాజీనామాతో లైనుకొత్తూరు పంచాయతీలో గత మూడు వారాలుగా ఉపాధి పనులు జరగడం లేదు. కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం ఇంకా జరగకపోవడంతో లైనుకొత్తూరు గ్రామంలో ఉపాధి కూలీలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఎండ తీవ్రతకు చెట్ల నీడన చేరిన ఉపాధి కూలీలు

వడ దెబ్బ నుంచి రక్షణ ఏదీ?

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లను పక్కాగా అందజేసేవారు. వడదెబ్బ నుంచి రక్షణకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, తాగునీటిని సైతం సమకూర్చేవారు. వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా 10 నుంచి 20 శాతం అలవెన్సులు ఇచ్చేవారు. వీటితో పాటు గడ్డపారలు, చెరగపారలు వంటివి అందజేసి ప్రోత్సహించేవారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొందరు కూలీలు ఎండలకు భయపడి ఉపాధి పనులకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తున్నా కూలి గిట్టుబాటు కావడం లేదని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండలకు అల్లాడుతున్నాం..



సంక్రాంతి పండగ తర్వాత ఎండల తీవ్రత క్రమంగా పెరిగింది. ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో నీడ కరువవుతోంది. ఎండలకు అల్లాడిపోతున్నాం. చెట్ల నీడ కూడా పని చేసే ప్రదేశాల్లో కాకుండా దూరంగా ఉంది. అప్పటి వరకు పనిచేసి కాస్త విశ్రాంతి తీసుకునే సమయానికి నీడ దొరకని పరిస్థితి ఉంటోంది. టెంట్లు ఏర్పాటు చేస్తే కూలీలకు కొంత ఉపశమనం కలుగుతుంది.

– వానపల్లి లక్ష్మి, ఉపాధి కూలి, రేగుపాలెం

మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి



కూలీలకు గతంలో ఇచ్చినట్టుగా మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి. ప్రస్తుతం రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. వేడిగాలులతో శరీరంలో నీరు తగ్గిపోతోంది. తరచుగా దాహం వేస్తోంది. వెంట తీసుకెళ్తున్న తాగునీరు చాలడం లేదు. మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందించాలి. వడదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి.

– మళ్లిపాటి జ్యోతి, ఉపాధి కూలి, రేగుపాలెం

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు అన్ని వసతులు కల్పించాలి. పనులు జరిగిన తర్వాత వేతనాలు సకాలంలో చెల్లించడం లేదు. పనులు జరిగిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించేలా చూడాలి. అలా ఇవ్వని క్రమంలో వడ్డీతో కలిపి చెల్లించాలనే నిబంధన ఉంది. అధికారులు దీనిని అమలు చేయాలి. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు దృష్టిపెట్టాలి.

– కొల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్, రేగుపాలెం

వసతుల కల్పనకు చర్యలు



ఉపాధి పనులు జరిగే గ్రామాల్లో కూలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతాం. వేసవిలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. త్వరలోనే ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూస్తాం.

– కొప్పిశెట్టి సత్య కొండలరావు, ఎంపీడీవో

బకాయిల కోసం ఉపాధి కూలీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: బకాయి వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపురంలో ఉపాధి హామీ పథకం కూలీలకు గత ఆరు వారాలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన బుధవారం వారితో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం వేతనాలు చెల్లించడంతో పాటు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రోజుకు కూలీకి రూ.600 వంతున వేతనం చెల్లించాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పసుపురెడ్డి నరసింగరావు, కడియం పద్మ, గోవిందమ్మ, నాగమణి, రాము, ఆదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చూచుకొండ విద్యార్థిని సంహితకు వైద్య పట్టా



డాక్టర్ పట్టా అందుకుంటున్న దుర్గ నాగ సంహిత

మునగపాక: మండలంలోని చూచుకొండ–గణపర్తికి చెందిన పెంటకోట దుర్గ నాగ సంహిత డాక్టర్ పట్టాను బుధవారం అందుకున్నారు. చూచుకొండకు చెందిన పెంటకోట అప్పారావు, వెంకటలక్ష్మి కుమార్తె సంహిత శ్రీకాకుళంలోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఈ మేరకు డాక్టర్ పట్టా అందుకున్న ఆమెను కుటుంబ సభ్యులతో పాటు చూచుకొండ–గణపర్తికి చెందిన పలువురు అభినందించారు.

బాలికలకు వ్యాస రచన పోటీలు



గురుకుల పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

నక్కపల్లి: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నక్కపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పురుషులతో మహిళలు సమానమే అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, మంచి స్పందన లభించిందని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక ఒత్తిడి నుంచి ఏ విధంగా బయట పడాలనే దానిపై శ్రీరామచంద్రమిషన్‌కు చెందిన హెల్త్ ఫిట్‌నెస్ ట్రైనర్ రామకృష్ణ వివరించారు. ఒత్తిడిని జయిస్తే కెరీర్‌లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణ, శివయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, జువాలజీ లెక్చరర్ జాన్ కిరణ్, సీడ్ ఆర్గనైజర్ అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే పీ-4 సర్వే పూర్తి చేయాలి



సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పి–4 సర్వే సత్వరమే గ్రామ కార్యదర్శులు పూర్తి చేయాలని ఎంపీడీవో జయప్రకాష్ రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 8 నుంచి 18వ తేదీ వరకు పీపుల్స్ పార్టనర్ షిప్‌తో అతి పేదలను మధ్య తరగతిలోకి తీసుకురావడానికి ధనవంతులైన 10 శాతం మంది సహాయ సహకారాలు తీసుకోవడం పీ–4 సర్వే నిర్వహించాలన్నారు. మండలంలో 50 వేల మంది అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌వో అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణంపై విచారణ



కొత్తపేట శివాలయంలో విచారణ జరుపుతున్న దేవాదాయశాఖ అధికారులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని పురాతన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణంపై స్థానికుడు పిల్లా నూకేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. యలమంచిలి దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, ఈవో సాంబశివరావు ఇక్కడ ఆలయం ఆవరణలో చేపట్టిన విచారణలో భాగంగా ఆలయ అర్చకుడు (సింగిల్ ట్రస్టీ) మేకా వంశీ, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, స్థానికులు, ఫిర్యాదుదారు నుంచి రాతపూర్వక వాంగ్మూలాలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు గత మూడేళ్లుగా ఎంతో కష్టపడి శిథిలమైన ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో పునర్నించారన్నారు. ఇందులో ఎక్కడా అక్రమాలు, అవినీతి జరగలేదన్నారు. ఇలాంటి ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటే శిథిలమైన ఇతర హిందూ ఆలయాల పునర్నిర్మాణానికి సహకరించడానికి ఎవరూ ముందుకురారన్నారు. తానిచ్చిన ఫిర్యాదులో అంశాలపై విచారణ జరగలేదని, పూర్తిగా పక్కదోవ పట్టించారని ఫిర్యాదుదారుడు నూకేశ్వరరావు అన్నారు. దేవదాయ శాఖకు చెందిన ఈ ఆలయ పునర్నిర్మాణానికి అనుమతి లేదని, విరాళాల సేకరణలో నిబంధనలు పాటించలేదని, శిథిలమైన ఆలయంతో పాటు ధ్వజ స్తంభం తొలగించినప్పుడు నిబంధనలు పాటించలేదని, ఆయన రాత పూర్వకంగా వాంగ్మూలం ఇచ్చారు.

ప్రభాకరరావు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు



ప్రభాకరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కరణం ధర్మశ్రీ, తదితరులు

రాంబిల్లి(యలమంచిలి): దిమిలి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నగిరెడ్డి ప్రభాకరరావు(83) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ప్రభాకరరావు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ అన్నారు. ఆయన కుమారులు నగిరెడ్డి నాగేశ్వరరావు, రమేష్, శ్రీనులను ఓదార్చి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్‌రాజు, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, దిమిలి గ్రామ నాయకుడు నగిరెడ్డి మురళీకృష్ణ, పార్టీ అచ్యుతాపురం మండలం అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, గేదెల శ్రీను, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, డీవీ సన్నయ్య, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గాదె గెలుపుపై పీఆర్‌టీయూ సంబరాలు



పీహెచ్‌సీలో గర్భిణులకు పండ్లు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఎస్.రాయవరం: ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపుపై పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.రాయవరం మండలంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో రోగులకు, వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, చిన్నారులకు పండ్లు, పాలు, రొట్టెలు, పలువురు అనాథలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరావు, చోడిశెట్టి సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

పాయకరావుపేట: మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రబీ ఈ–పంట కోసం ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ జి.గోపీకృష్ణ, ఎంపీఈవో జి.శరత్, పి.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

పాయకరావుపేట: సారా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఆయన నవోదయ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారా వల్ల కలిగే దుష్ప్రభావంపై అవగాహన కల్పించారు. సారా అమ్మకం, తయారు చేస్తే 14405 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, దళిత నాయకులు పెదపాటి మేఘురంజన్, ఇంజరపు సూరిబాబు, గారా చంటి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పొగ మంచు.!



పొగమంచులో పూడిమడకరోడ్డు

మునగపాక: ఒక పక్క ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండిపోయి వడగాడ్పులు వీస్తుంటే.. మరో పక్క తెల్లవారుజామున దట్టంగా పొగమంచు కమ్ముకుంటోంది. మండల వ్యాప్తంగా బుధవారం పొగ మంచు పెరిగిపోయింది. ఉదయం 7 గంటలు కావొచ్చినా పొగ మంచు తగ్గకపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పూడిమడక రోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేనంతగా పొగ మంచు కురిసింది. కొంతమంది వాహనదారులు ఫ్లడ్ లైట్లు వెలిగించి మరీ రాకపోకలు సాగించారు.

సోషల్ మీడియాకు బానిసలు కావద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ సుధాకర్

అచ్యుతాపురం రూరల్ : సోషల్ మీడియాకు యువకులు బానిసలు కావద్దని అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన నమూనా పరీక్ష విజేతలకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహుమతుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇటువంటి నమూనా పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, జీవీవీ జిల్లా కార్యదర్శి రాంకుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహన మిత్ర కోసం ఆటో డ్రైవర్ల ఆందోళన



రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

యలమంచిలి రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని, వెంటనే వాహన మిత్ర నిధులను లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయాలని ఆటో డ్రైవర్లు బుధవారం ఆందోళన చేశారు. ఆటో కార్మికులకు ఇబ్బంది కలిగించే జీవో నంబర్లు 21, 31లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని బస్టాండు పక్కనున్న ఆటో స్టాండు వద్ద వారంతా నిరసన తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఆ పథకం అమలుపై పునరాలోచించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు కోరారు. వాహనమిత్ర అమలు చేయకపోగా భారీగా విధిస్తున్న జరిమానాలతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 14 డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆటో కార్మికులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అల్లిమళ్ల నాగు, బంగారు అప్పలనాయుడు, ఎన్ శివ, బాషా, విశ్వనాథం, జి.మణికంఠ, పల్లా రాజు, నమ్మి రాము పాల్గొన్నారు.

పోషకాహారం శ్రేయస్కరం

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు కోరారు. తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలోని బాలింతలు, గర్భిణులకు బుధవారం ఆయన పోషక ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తాజా ఆహారంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ జోలికి పోరాదని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ కాండ్రేగుల సత్యవతి, పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలికలు ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలి

పాయకరావుపేట: బాలికలు ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ నిషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా గుంటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌లపై తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం మహిళా దినోత్సవ వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు.